# షాక్

మగవాళ్ళు బజారునుంచి ఎంత మంచి వస్తువులు తెచ్చినా, ఎంత చౌకగా తెచ్చినా, వస్తువులు కొనడం, బేరమాడడం, చేతకాదని, ఆ కొట్టు వాడు టోపీ వేశాడని ఆడవాళ్ళకి గట్టినమ్మకం. తాము ఇళ్ళదగ్గరకు వచ్చి నవి బేరమాడికొంటేనే వాళ్ళకు తృప్తి ఆ రోజూ ఆఫీసునుంచి ఇంటికి వచ్చేను.

శ్రీమతి ప్లేటులో టిపినుతో, మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది. "మీ కిష్టమని పచ్చిమిరపకాయ బజ్జీలు చేశాను." బజ్జీలు తింటున్నాను. నిజం చెప్పద్దూ. మా ఆవిడ చేతివంటకు ఎదురులేదు. అందులో పచ్చిమిరపకాయ బజ్జీలు చేయటంలో స్పెషలిస్ట్.

"ఎలావున్నాయ్" అంది.

"ఎలా వుంటాయ్. నీలాగే రుచిగా వున్నాయి" అన్నాను. లోపలకు వెళ్ళి కాఫీ పట్టుకువచ్చింది. కాఫీ సిప్ చేస్తున్నాను.

"మీరేమీ కోప్పడనంటే, నేను ఈరోజున ఒక పనిచేశాను" అదీ అసలు సంగతి.

"ఏం చేశావ్"

"వీధిలోకిచీరలబ్బాయి వస్తేను తీసుకున్నాను. మీరు ఒకసారి నూట ఏభయి రూపాయలకు కొన్న పాలిష్టర్ చీర అలాంటిదే—గుర్తుందా? సరిగ్గా అలాంటిదే నేను ఎనభయి రూపాయలకు కొన్నాను బేరమాడి" అంది ఏదో యడ్వంచర్ చేసినట్లుగా. గబగబా లోపలకువెళ్ళి తనుకొన్న చీర తీసుకువచ్చింది. పోలితిన్ కవర్‌లో వుంది చీర. బయటకుతీసి చూశాను. డిజైన్ చాలాబాగుంది. క్వాలిటీకూడా ఫర్వాలేదు. అయితే ఎనభయి రూపాయలకు ఎలా ఇచ్చాడు? "సెకండ్స్" అని ముద్ర వుంది. అందువలన కొంచెం తగ్గవచ్చు కానీ నాకు ఏదో అనుమానం వచ్చింది.

"నీ చీర ఇంకోటిపట్రా" అన్నాను. ఇంట్లో చీరతోనూ క్రొత్తచీర కొలిచి చూశాము. దాదాపు మీటరున్నర తక్కువవుంది.

"ఇదేమిటండీ. ఎలాకట్టుకోను. మాకు వాడు చూపించిన చీర 5 మీటర్లువుందే. మిగతా చీరలన్నీ ఒకటేనని నమ్మల్ని కవర్లలోంచి తియ్యనియ్యలేదు. ఇలాఅని తెలిస్తే వాడు చూపించినదే తీసుకునేదాన్ని" బిక్కమొగం వేసింది శ్రీమతి.

"డియర్, వీధిలోకి మూటలు తెచ్చేవాళ్ళు చవగ్గా ఇస్తారంటే ఎందుకు ఇస్తారనుకున్నావ్....3 1/2 మీటర్లు చీర ఎనభయి రూపాయలకు ఇచ్చాడు. ఏ రాయి అయితేనేం? పైగా ఈ చీర "సెకండ్స్" అంటే ఫ్యాక్టరీలో ఏదో ఒక లోపం వున్న చీరలు ఇలా ముద్రవేసి గుట్టగాపోసి చౌకగా అమ్ముతారు. కాని ఒక్కోసారి మంచివికూడా దొరుకుతాయి. అయినా నెలాఖరులో నీకు డబ్బు ఎక్కడిది?" అడిగాను.

శ్రీమతి ఇంకా చిన్నబోయిన ముఖంతో—

"మొన్న మీ కథకి వంద రూపాయలు వచ్చాయికదా. అవి ఖర్చు పెట్టద్దని చెప్పారుకూడా. అయినా తీసేను.".

షాక్ తినడం ఈసారి నావంతయింది.

—o—

# ధర్మ సందేహం

మానవ శరీరం ఎంత చిత్రమైంది. శరీరంలో ఏ భాగం పనిచేయక పోయినా మనం ఎందుకు పనికిరాము. కనీసం చిటికెనవ్రేలు తెగిందంటే మిగతా చేతివ్రేళ్ళతో పనిచేయలేము.

నాకు గత పదిహేను రోజులనుండి ఛాతీలో నెప్పివస్తోంది. నాకు తెలిసిన మాత్రలు వేసుకుని కాలక్షేపం చేస్తున్నాను. కాని నొప్పి కంట్రోల్ అవలేదు. ఇక లాభంలేదు డాక్టర్ని సంప్రదించాలి అనుకుని డాక్టర్ దగ్గరకు బయలుదేరాను.

మా బాబు నావెంట బయలుదేరాడు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తప్పించి, మిగతా సందర్భాలలో నన్ను వాడు వదలివుండడు. అక్కడికీ ఇంజెక్షన్ చేస్తారని బెదిరించాను కూడా వినలేదు.